# దశ మార్చిన దళితబంధు




## తిరుమలగిరి నియోజకవర్గంలో 2,223 కుటుంబాలకు అందజేత

**ఒక్కో కుటుంబానికి రూ.10లక్షల ఆర్థిక సాయం**

**నచ్చిన యూనిట్లు ఏర్పాటు చేసుకొని జీవనోపాధి పొందుతున్న లబ్ధిదారులు**

**మరోసారి బీఆర్ఎస్‌ను గెలిపిస్తే నియోజకవర్గమంతా వర్తింపజేస్తామని సీఎం కేసీఆర్ ప్రకటన**

దళితుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా దళితబంధు పథకం ప్రవేశపెట్టారు. రాష్ట్రం నలు దిక్కుల నుంచి నాలుగు మండలాలను పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేశారు. ఇందులో భాగంగా తిరుమలగిరి మండలాన్ని మొదటి దశలో ఎంపిక చేసి 2,223 మంది దళిత కుటుంబాలకు రూ.10లక్షల చొప్పున అందజేశారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.250 కోట్లు వెచ్చించింది. ప్రభుత్వం అందించిన డబ్బుతో లబ్ధిదారులు తమకు నచ్చిన యూనిట్లు ఏర్పాటు చేసుకొని జీవనోపాధి పొందుతూ ఆర్థికంగా బలోపేతం అవుతున్నారు. సర్కారు సాయంతో నాడు కూలీలుగా ఉన్న దళితులు నేడు ఓనర్లుగా మారారు. ప్రధానంగా ఆటోలు, ట్రాలీలు, జేసీబీలు, ఫొటో స్టూడియోలు, ఫ్లెక్సీ షాపులు, మినీ డెయిరీ ఫామ్‌లు నడుపుకొంటూ సంతోషంగా జీవిస్తున్నారు.

– తిరుమలగిరి, నవంబర్ 11

### మళ్లీ గెలిపిస్తే దళితబంధు విస్తరిస్తామన్న సీఎం

మూడోసారి గాదరి కిశోర్‌కుమార్‌ను గెలిపిస్తే నియోజకవర్గమంతా దళితబంధు ఇస్తామని ఇటీవల తిరుమలగిరిలో నిర్వహించిన తుంగతుర్తి సమర శంఖారావం సభలో ముఖ్యమంత్రి కేసీఆర్ హామీ ఇచ్చారు. దాంతో నియోజకవర్గంలోని దళితులంతా తమ బతుకులు మారనున్నాయని భావిస్తున్నారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌ను మళ్లీ గెలిపించుకోవాలనే దృఢ సంకల్పంతో కనిపిస్తున్నారు. నియోజకవర్గంలో ఎస్సీ జనాభా 76,850 మంది ఉండగా, బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తే వీరి తలరాతలు మారనున్నాయి. ఇప్పటికే బీసీ బంధు, ముస్లిం బంధు కింద మొదటి విడుతలో లక్ష చొప్పున ఇవ్వడం జరిగింది. ముఖ్యమంత్రి కేసీఆర్ మాట ఇస్తే వెనక్కి తగ్గరని ప్రజలు విశ్వసిస్తున్నారు.

### సీఎం కేసీఆర్ పుణ్యాన ఓనర్లమయ్యాం



గతంలో నేను, మా అన్న మధు తిరుమలగిరిలో ఫ్లెక్సీ షాపుల్లో పని చేసేవాళ్లం. నేను సూపర్‌వైజర్‌గా, అన్నయ్య డిజైనర్‌గా వేర్వేరు షాపుల్లో పని చేసేది. అలా మూడేండ్లు చేశాం. నెలకు నాకు రూ.12 వేలు, అన్నయ్యకు రూ.8వేల జీతం వచ్చేది. ఎక్కువ పని గంటలు చేయాల్సి వచ్చేది. నాడు చాలీచాలని వేతనంతో జీవనం కష్టంగా ఉండేది. దళితబంధు పథకం కింద తిరుమలగిరి మండలం పైలెట్ ప్రాజెక్ట్ కింద ఎంపికవడంతో మాకు కూడా అవకాశం దొరికింది. సంవత్సరం క్రితం దళితబంధు పథకంలో వచ్చిన రూ.10 లక్షలతో డిజిటల్ ఫ్లెక్సీ సెంటర్‌ను పెట్టాం. ఇప్పుడు చేతి నిండా పని దొరుకుతుంది. మాతోపాటు నలుగురికి జీవనోపాధి కల్పిస్తున్నాం. నెలకు రూ.40 వేలు సంపాదిస్తున్నాం. ఆనందంగా ఉన్నది. ఒకరి దగ్గర పనిచేయాల్సిన అవసరం లేకుండా పోయింది. ముఖ్యమంతి కేసీఆర్ పుణ్యమా అని వర్కర్ల నుంచి ఓనర్లమయ్యాం.

– కొమ్ము నవీన్, ఫ్లెక్సీషాపు నిర్వాహకుడు, నందాపురం, తిరుమలగిరి మండలం

### నెలకు రూ.40 వేలు సంపాదిస్తున్నా

మాది తిరుమలగిరి మండలంలోని గుండెపురి గ్రామం. బతుకుదెరువు కోసం నేను, మా అన్న హైదరాబాద్‌లో మార్వాడీలకు చెందిన ప్లైవుడ్, హార్డ్‌వేర్ షాపులో గుమస్తాగా చేసేది. నెలకు చెరో రూ.10 వేలు వచ్చేది. మాకు ఇద్దరిద్దరు పిల్లలు. కుటుంబం గడవటం కష్టంగా ఉండేది. ఈ తరుణంలో ముఖ్యమంత్రి కేసీఆర్ తిరుమలగిరి మండలాన్ని దళితబంధు పైలెట్ ప్రాజెక్ట్ కింద ప్రకటించారు. దాంతో మా తలరాత మారింది. మేము మా గ్రామానికి వచ్చి ప్రభుత్వం ఇచ్చిన డబ్బుతో తిరుమలగిరిలో ప్లైవుడ్, హార్డ్‌వేర్ షాపు పెట్టుకున్నాం. గిరాకీ బాగానే వస్తుంది. నెలకు రూ.40వేల వరకు సంపాదిస్తున్నాం. ఎంతో సంతోషంగా ఉన్నది. దళిత బంధు పథకం లేకపోతే నానా అవస్థలు పడాల్సి వచ్చేది. ముఖ్యమంత్రి కేసీఆర్ రూ.10 లక్షలు ఇచ్చి మాకు కొత్త జీవితాన్ని ప్రసాదించారు. ఆయనకు జీవితాంతం రుణపడి ఉంటాం.

– పల్లెపాక పరశురాం, హార్డ్‌వేర్ షాపు నిర్వాహకుడు, తిరుమలగిరి మండలం



### దళితబంధు ధైర్యాన్నిచ్చింది

దళిత బంధు పైలెట్ ప్రాజెక్ట్ కింది తిరుమలగిరి మండలం ఎంపికవడంతో దరఖాస్తు చేసుకున్నా. నాకు వచ్చిన డబ్బుతో తిరుమలగిరిలో ఫొటోస్టూడియో పెట్టుకున్నా. గతంలో రూ.5 వేలకు స్టూడియోలో పని చేసేవాడిని. చాలీచాలని వేతనంతో కుటుంబ జీవనం భారమయ్యేది. ఇప్పుడు ఫొటో స్టూడియోతో నెలకు రూ.30వేలు సంపాదిస్తున్నా. దళిత బంధు వచ్చి నాకు కొండంత ధైర్యాన్ని ఇచ్చింది. ఇప్పుడు నా కాళ్లపై నేను నిలబడ్డా. ఎవరి దగ్గరా పని చేసే అవసరం లేదు.

– గుండెపురి లాలు, ఫొటో స్టూడియో నిర్వాహకుడు, తిరుమలగిరి



### దళిత బంధుతో మా జీవితాల్లో కొత్త వెలుగులు

మాది వ్యవసాయ కూలీ కుటుంబం. అమ్మానాన్న వ్యవసాయ పనులకు వెళ్లేవాళ్లు. నేను డిగ్రీ పూర్తి చేసి స్థానిక బట్టల షాపులో గుమస్తాగా పనికి కుదిరాను. ఏడు సంవత్సరాలుగా రోజూ 12 గంటలపాటు పని చేస్తే నెలకు రూ.9వేలు మాత్రమే వచ్చేవి. ఆ డబ్బుతో ఇల్లు గడవడం కష్టంగా ఉండేది. నాన్న కాలుకు ఇన్ఫెక్షన్ అయితే ఆపరేషన్ కోసం అప్పు చేసి దవాఖాన బిల్లులు కట్టాల్సి వచ్చింది. ఇలాంటి దయనీయ స్థితిలో ఉన్న మమ్మల్ని దళితబంధు పథకం ఆదుకున్నది. ప్రభుత్వం అందించిన రూ.10 లక్షలతో నాతోపాటు పత్తేపురం త్రిశూల్, కందుకూరి వెంకన్నతో కలిసి జేసీబీని తీసుకున్నాం. దాంతో మా ముగ్గురి జీవితాల్లో వెలుగులు నిండాయి. ఏ ఒక్కరోజూ ఖాళీ లేకుండా నిత్యం పని దొరుకుతున్నది. ఖర్చులు పోను ఒక్కొక్కరికి రూ.25వేల చొప్పున మిగులుతున్నాయి. ఒకరి కింద ఉద్యోగం చేసి అగచాట్లు పడ్డ మాకు దళితబంధు కల్పతరువుగా మారింది. తెలంగాణ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ధన్యవాదాలు.

– వడ్డె శోభన్‌బాబు, జేసీబీ ఓనర్, తిరుమలగిరి



# 14న హాలియాలో సీఎం కేసీఆర్ సభ




## ప్రజా ఆశీర్వాద బహిరంగ సభకు విస్తృత ఏర్పాట్లు

**అనుముల సమీపంలో సభ**

**స్వచ్ఛందంగా తరలివచ్చేందుకు జనం సన్నద్ధం**

**సాగర్ అభివృద్ధి కేసీఆర్‌తోనే సాధ్యమంటూ ప్రజల విశ్వాసం**

**ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే భగత్, ఎమ్మెల్సీ కోటిరెడ్డి**



నల్లగొండ ప్రతినిధి, నవంబర్ 11 (నమస్తే తెలంగాణ) : అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్ పార్టీ అభ్యర్థుల తరఫున విస్తృత ప్రచారం చేస్తున్నారు. అందులో భాగంగా ఈ నెల 14న నాగార్జునసాగర్ నియోజకవర్గానికి రానున్నారు. అదే రోజు ముందుగా జనగామ జిల్లా పాలకుర్తి నియోజకవర్గ సభలో పాల్గొంటారు. అనంతరం హెలికాప్టర్‌లో హాలియాకు చేరుకోనున్నారు. మధ్యాహ్నం రెండు గంటలకు హాలియా పట్టణం నుంచి పెద్దవూర రోడ్డులో అనుముల దాటాక విశాలమైన స్థలంలో జరిగే ప్రజా ఆశీర్వాద సభలో పాల్గొంటారు. నాగార్జునసాగర్ నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి, చేపట్టాల్సిన పనులు తదితర అంశాలతో పాటు దేశ, రాష్ట్ర రాజకీయాల గురించి ప్రజలనుద్దేశించి ప్రసంగించనున్నారు. మలి విడుత ప్రచారంలో భాగంగా సీఎం కేసీఆర్ ఉమ్మడి నల్లగొండ జిల్లాలో నాలుగు చోట్ల పర్యటించనున్నారు. మంగళవారం హాలియా పర్యటన అనంతరం ఈ నెల 20న నకిరేకల్, నల్లగొండ నియోజకవర్గాల్లో, 21న సూర్యాపేట సభల్లో పాల్గొనేలా ఇప్పటికే షెడ్యూల్ ఖరారైంది. తొలి విడుతలో భువనగిరి, మునుగోడు, కోదాడ, తుంగతుర్తి, ఆలేరు, హుజూర్‌నగర్, మిర్యాలగూడ, దేవరకొండ నియోజకవర్గాల్లో ముఖ్యమంత్రి ప్రచారం నిర్వహించారు. అన్ని చోట్లా బీఆర్ఎస్ సర్కార్ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూనే కాంగ్రెస్, బీజేపీ చేస్తున్న కుట్రలను, బూటకపు హామీలపై ప్రజలకు విడమర్చి చెబుతున్నారు. నల్లగొండ జిల్లా అభివృద్ధిలో బీఆర్ఎస్ సర్కార్ పాత్ర ఏంటో విపులంగా చెప్పుకొచ్చారు. ఈ నేపథ్యంలో హాలియాలో జరిగే ప్రజా ఆశీర్వాద సభలో నాగార్జునసాగర్ నియోజకవర్గ అభివృద్ధి పట్ల బీఆర్ఎస్‌కు ఉన్న ప్రణాళికలను ప్రజలకు వివరించనున్నారు.

### ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ

ప్రజా ఆశీర్వాద సభకు మరో రెండు రోజులే మిగిలి ఉండడంతో చకచకా ఏర్పాట్లు చేస్తున్నారు. అనుముల సమీపంలో ప్రభుత్వ ఐటీఐ కాలేజీకి ఎదురుగా 10 ఎకరాల స్థలాన్ని సభ కోసం ఎంపిక చేశారు. ఇప్పటికే స్థలాన్ని చదును చేయడంతోపాటు సభా వేదిక ఏర్పాట్లు షురూ చేశారు. దీంతోపాటు నియోజకవర్గ వ్యాప్తంగా వచ్చే వాహనాల కోసం ప్రత్యేకంగా అన్ని వైపులా పార్కింగ్ ప్రదేశాలు ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. పార్కింగ్ స్థలాలను కూడా చదును చేసే పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. శనివారం సభా ఏర్పాట్లను ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, ఎమ్మెల్యే నోముల భగత్, జడ్పీ వైస్ చైర్మన్ ఇరిగి పెద్దులు, ఆప్కాబ్ మాజీ చైర్మన్ యడవెల్లి విజయేందర్‌రెడ్డి, పార్టీ నాయకులు పరిశీలించారు. సభా వేదిక, వీఐపీ, మీడియా, మహిళా గ్యాలరీలు, బారికేడ్ తదితర ఏర్పాట్లను పర్యవేక్షించారు. సభకు స్వచ్ఛందంగా తరలి వచ్చేందుకు వేలాది మంది సిద్ధమవుతుండగా.. వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎమ్మెల్యే నోముల భగత్ వెల్లడించారు. సాగర్ అభివృద్ధి ప్రదాత సీఎం కేసీఆర్‌కు ఘన స్వాగతం పలికేందుకు నియోజకవర్గ ప్రజలు సిద్ధమవుతున్నారని చెప్పారు. ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి ముఖ్యమంత్రి పట్ల తమ అభిమానాన్ని చాటాలని ఎమ్మెల్యే భగత్, ఎమ్మెల్సీ కోటిరెడ్డి ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

### సీఎం సభకు చకచకా ఏర్పాట్లు

**పనులను పరిశీలించిన ఎమ్మెల్యే భగత్, ఎమ్మెల్సీ కోటిరెడ్డి**

హాలియా, నవంబర్ 11 : ఎన్నికల ప్రచారంలో భాగంగా ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ నెల 14న హాలియాకు రానున్నారు. హాలియా మున్సిపాలిటీ పరిధిలోని అనుముల గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే ప్రజా ఆశ్వీరాద బహిరంగ సభలో ప్రసంగించనున్నారు. ఉప ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చిన ముఖ్యమంత్రి కేసీఆర్‌ను చూసేందుకు నియోజకవర్గ వ్యాప్తంగా బీఆర్ఎస్ శ్రేణులు, ప్రజలు స్వచ్ఛందంగా తరలి వచ్చేందుకు ఆసక్తి చూపుతున్నారు. సభకు సుమారు లక్ష మంది వచ్చే అవకాశం ఉండగా.. ఆ మేరకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సభతో సాగర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ మరింతగా పుంజుకునే అవకాశం ఉన్నది. సభ కోసం పార్టీ నాయకులు ఏర్పాట్లు ముమ్మరం చేశారు. హాలియా – దేవరకొండ ప్రధాన రహదారి వెంట అనుముల గ్రామంలో 10 ఎకరాల స్థలాన్ని జేసీబీలు, డోజర్లతో శుభ్రం చేస్తున్నారు. సభ ఏర్పాట్లను శనివారం ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డితో కలిసి బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్ పరిశీలించారు. పనులు జరుగుతున్న తీరును పార్టీ నాయకులను అడిగి తెలుసుకున్నారు. సభ విజయవంతానికి పార్టీ నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. వారి వెంట జడ్పీ వైస్ చైర్మన్ ఇరిగి పెద్దులు, ఆప్కాబ్ మాజీ చైర్మన్ యడవల్లి విజయేందర్‌రెడ్డి, అనుముల ఎంపీపీ సుమతీపురుషోత్తం, కౌన్సిలర్లు నల్లబోతు వెంకటయ్య, ప్రసాద్‌నాయక్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు వడ్డె సతీశ్‌రెడ్డి, నాయకులు ఉన్నారు.

# అన్నదాతకు దన్నుగా.. దున్నపోతులగండి

**రూ.219కోట్లతో చిట్యాల వద్ద ప్రాజెక్టు నిర్మాణం**

**ఇప్పటికే 20 శాతం పనులు పూర్తి**

**అందుబాటులోకి వస్తే 12,610 ఎకరాలకు సాగునీరు**

**సంతోషం వ్యక్తం చేస్తున్న అడవిదేవులపల్లి మండల రైతులు**



చిట్యాలలో జరుగుతున్న ప్రాజెక్టు పనులు

అడవిదేవులపల్లి, నవంబర్ 11 : వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యమిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం.. అన్నదాతలను ఆదుకునేందుకు అనేక పథకాలు ప్రవేశపెట్టింది. రైతుబంధు, రైతుబీమా, 24గంటల విద్యుత్‌తో పాటు మద్దతు ధరకు పంటలను కొనుగోలు చేస్తున్నది. అదేవిధంగా సాగునీటిని అందించేందుకు చెరువులు, కుంటల పునరుద్ధరణతోపాటు ప్రాజెక్టులు, లిఫ్టుల నిర్మాణం చేపడుతున్నది. ఈ క్రమంలో అడవిదేవులపల్లి మండల రైతులకు సాగునీరు అందించేందుకు చిట్యాల వద్ద దున్నపోతుల గండి ప్రాంతంలో ప్రాజెక్టు నిర్మాణం చేపడుతున్నది. ఇందుకోసం ప్రభుత్వం రూ.219 కోట్లు మంజూరు చేయగా.. ఇప్పటికే 20శాతం పనులు పూర్తయ్యాయి. 2024 మార్చి నాటికి పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని నిర్ణయించారు. ఈ ప్రాజెక్టుతో మండలంలోని 12,610 ఎకరాలకు సాగునీరు అందనుంది. దీంతో మండల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### అహల్య వాగుపై ప్రాజెక్టు నిర్మాణం

నిరంతరం ప్రవహించే అహల్య వాగు అడవిదేవులపల్లి మండలంలోని చిట్యాల వద్ద కృష్ణానదిలో కలుస్తున్నది. ఈ నీరు ప్రస్తుతం టెయిల్‌పాండ్ పైభాగాన ఉన్నది. ఏటా వందలాది టీఎంసీల నీరు వృథాగా దిగువకు పోతున్నది. ఈ నీటిని సద్వినియోగం చేసుకొని పొలాలకు అందించాలని రాష్ట్ర ప్రభుత్వం యోచించింది. ఈ క్రమంలో చిట్యాల గ్రామ శివారులోని అహల్య బ్యాక్ వాటర్ వద్ద దున్నపోతుల గండి ప్రాంతంలో ప్రాజెక్టు ఏర్పాటుకు ప్రణాళిక రూపొందించింది. ఈ ప్రాంతంలో అన్ని సీజన్లలో పుష్కలంగా నీరు అందుబాటులో ఉంటుండంతో రిజర్వాయర్ ఏర్పాటు చేసి 16 కిలోమీటర్ల పైప్‌లైన్ ద్వారా ముదిమాణిక్యం మేజర్ ఉల్సాయపాలెం వద్ద ఆర్– 24కు అనుసంధానం చేయనున్నారు. అక్కడక్కడ లిఫ్టులు ఏర్పాటు చేసి ఆయా గ్రామాలకు సాగునీరు అందించనున్నారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.219కోట్లు మంజూరు చేసింది. ఈ ప్రాజెక్టు పూర్తయితే అడవిదేవులపల్లి మండలంలోని ఉల్సాయిపాలెం, ముదిమాణిక్యం, అడవిదేవులపల్లి, బాలెంపల్లి, మొల్కచర్ల, చిట్యాల, చాంప్లాతండా గ్రామాల పరిధిలో 12,610 ఎకరాలకు సాగునీరు అందనుంది. ఎక్కువగా బోర్లు, వర్షంపైనే ఆధారపడి వ్యవసాయం చేసుకునే అడవిదేవులపల్లి మండల రైతులు ఈ ప్రాజెక్టుతో దర్జాగా సాగు చేసుకోవచ్చని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అన్ని సీజన్లలో పుష్కలంగా సాగు నీరు అందుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

### దున్నపోతుల గండితో మా కష్టాలు పోతాయి



ఎన్నో ఏండ్లుగా నీటి కోసం ఇబ్బంది పడుతున్న మా రైతుల ఇబ్బందులు దున్నపోతులగండి ప్రాజెక్టుతో తీరుతాయి. సీఎం కేసీఆర్ సారు ముందు చూపుతో రైతుల ఇబ్బందులను గుర్తించి వందలాది కోట్లతో ప్రాజెక్టును నిర్మిస్తుండడం ఆనందంగా ఉన్నది. ఈ ప్రాజెక్టు నిర్మాణంతో భూగర్భ జలాలు కూడా సమృద్ధిగా ఉంటాయి. ఇది పూర్తయితే మా బాధలు మొత్తం తీరినట్లే.

– పచ్చిపాల లింగయ్య, రైతు, అడవిదేవులపల్లి

### సీఎం కేసీఆర్ సారుకు ధన్యవాదాలు



గత ప్రభుత్వాలు మా బాధలను ఏనాడూ పట్టించుకున్న పాపాన పోలేదు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తరువాత ముఖ్యమంత్రి కేసీఆర్ సారథ్యంలో బీడు భూములు పచ్చగా మారుతున్నాయి. గతంలో మా మండలంలో ప్రాజెక్టు కలగానే ఉండేది. అసలు పూర్తవుతుందా.. లేదా? అనుకునేవాళ్లం. సీఎం కేసీఆర్ సారు మా బాధలను గుర్తించి వందలాది కోట్లు విడుదల చేసి దున్నపోతులగండి ప్రాజెక్టును నిర్మిస్తున్నారు. ఇక ఏ చింతా లేకుండా హాయిగా వ్యవసాయం చేసుకుంటాం.

– కుర్ర హాతీరాం, రైతు, జిలకరకుంటతండా, అడవిదేవులపల్లి మండలం

# సూర్యాపేట జిల్లా ఓటర్లు 9,85,962



**తుది ఓటరు జాబితా విడుదల**

**అత్యధికంగా 5,01,157 మంది మహిళా ఓటర్లు**

**4,84,747 మంది పురుషులు**

**తుంగతుర్తి నియోజకవర్గంలో ఎక్కువ మంది ఓటర్లు**

**కొత్తగా 22,185 మందికి ఓటు హక్కు**

సూర్యాపేట, నవంబర్ 11 : ఈ నెల 30న జరిగే శాసనసభ ఎన్నికల్లో ఓటు వేసే ఓటర్ల జాబితాను ఎన్నికల సంఘం విడుదల చేసింది. సూర్యాపేట జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల పరిధిలో 9,85,962 మంది ఓటర్లు ఉన్నట్లు తేల్చింది. ఇందులో 4,84,747 మంది పురుషులు, 5,01,157 మంది మహిళా ఓటర్లు, ఇతరులు 58 మంది ఉన్నారు. అత్యధికంగా తుంగతుర్తి నియోజకవర్గంలో 2,55,017 మంది ఓటర్లు ఉండగా.. హుజూర్‌నగర్‌లో 2,47,592, సూర్యాపేటలో 2,41,799, కోదాడ నియోజకవర్గంలో 2,41,554 మంది ఓటర్లు ఉన్నారు. గత నెలలో ఎన్నికల సంఘం విడుదల చేసిన ఓటర్ల జాబితాలో 9,63,777 మంది ఓటర్లు ఉండగా.. శనివారం విడుదల చేసిన జాబితాలో ఆ సంఖ్య భారీగానే పెరిగింది. దాదాపు 22,185 మంది కొత్తగా ఓటు హక్కు పొందారు. మొత్తంగా 9,85,962 మంది ఓటర్లు ఈ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.

**మండలాల వారీగా ఓటర్ల వివరాలు**

**సూర్యాపేట నియోజకవర్గం**

| మండలం | పురుషులు | మహిళలు | ఇతరులు | మొత్తం |
|---|---|---|---|---|
| సూర్యాపేట | 60,304 | 63,980 | 5 | 1,24,289 |
| పెన్‌పహాడ్ | 16,400 | 16,895 | 2 | 33,297 |
| చివ్వెంల | 20,412 | 21,106 | 10 | 41,528 |
| ఆత్మకూర్(ఎస్) | 21,330 | 21,355 | 0 | 42,685 |
| మొత్తం | 1,18,446 | 1,23,336 | 17 | 2,41,799 |

**హుజూర్‌నగర్ నియోజకవర్గం**

| మండలం | పురుషులు | మహిళలు | ఇతరులు | మొత్తం |
|---|---|---|---|---|
| నేరేడుచర్ల | 17,071 | 17,950 | 1 | 35,022 |
| పాలకవీడు | 10,077 | 10,668 | 0 | 20,745 |
| మఠంపల్లి | 18,080 | 18,787 | 1 | 36,868 |
| మేళ్లచెర్వు | 16,341 | 16,970 | 1 | 33,312 |
| చింతలపాలెం | 12,801 | 13,211 | 0 | 26,012 |
| హుజూర్‌నగర్ | 24,158 | 25,836 | 7 | 50,001 |
| గరిడేపల్లి | 22,156 | 23,468 | 8 | 45,632 |
| మొత్తం | 1,20,684 | 1,26,890 | 18 | 2,47,592 |

**కోదాడ నియోజకవర్గం**

| మండలం | పురుషులు | మహిళలు | ఇతరులు | మొత్తం |
|---|---|---|---|---|
| మోతె | 18,312 | 18,468 | 4 | 36,784 |
| మునగాల | 17,653 | 18,323 | 0 | 35,976 |
| చిలుకూరు | 15,551 | 16,,404 | 0 | 31,955 |
| అనంతగిరి | 12,315 | 12,920 | 1 | 25,236 |
| కోదాడ | 42,310 | 45,295 | 9 | 87,614 |
| నడిగూడెం | 11,898 | 12,090 | 1 | 23,989 |
| మొత్తం | 1,18,039 | 1,23,500 | 15 | 2,41,554 |

**తుంగతుర్తి నియోజకవర్గం**

| మండలం | పురుషులు | మహిళలు | ఇతరులు | మొత్తం |
|---|---|---|---|---|
| మోత్కూరు | 13,445 | 13,508 | 0 | 26,953 |
| అడ్డగూడూరు | 11,190 | 11,441 | 0 | 22,631 |
| శాలిగౌరారం | 19,642 | 19,741 | 3 | 39,386 |
| జాజిరెడ్డిగూడెం | 11,883 | 11,942 | 1 | 23,826 |
| నూతనకల్ | 14,170 | 13,965 | 0 | 28,135 |
| మద్దిరాల | 12,374 | 12,290 | 1 | 24,665 |
| తుంగతుర్తి | 16,851 | 16,546 | 0 | 33,397 |
| నాగారం | 11,807 | 11,881 | 3 | 23,691 |
| తిరుమలగిరి | 16,216 | 16,117 | 0 | 32,333 |
| మొత్తం | 1,27,578 | 1,27,431 | 8 | 2,55,017 |